పరిధి విశాలం.. ఇరుకైన భవనం

- ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో సమస్యలు
- చాలీచాలని భవనంలో విధుల నిర్వహణ
- పరిధి పెంపు సరే.. అదనపు సిబ్బంది ఎక్కడ?



ఆరిలోవ పోలీస్ స్టేషన్

ఆరిలోవ: స్థల సమస్య ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను వేధిస్తోంది. దశాబ్దాలుగా ఇరుకైన భవనంలోనే సేవలు అందిస్తోంది. అసలే స్టేషన్ పరిధి విశాలం కావడంతో కుప్పలుగా ఫిర్యాదులు, గొడవలు, ప్రమాదాలకు సంబంధించిన వ్యవహారాలతో నిత్యం హడావుడిగా ఉండే ఈ స్టేషన్ పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇది పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్‌గా అవతరించినప్పటి నుంచీ ఇక్కడి భవనం చాలా చిన్నది. ఇందు కోసం పోలీస్ ఉన్నతాధికారులు బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని హనుమంతవాక దరి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన విమ్స్ సమీపంలో కొత్తగా భవన నిర్మాణం చేపట్టారు. ఒక సంవత్సరంలో పూర్తి చేస్తామంటూ చెప్పిన ఉన్నతాధికారులు ఈ నిర్మాణాన్ని 2019 నుంచి ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఆ భవనం ఇంకెప్పుడు నిర్మాణం పూర్తి చేసుకొంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ భవన నిర్మాణం పూర్తయితే ఇక్కడ ఇరుకు గదిలో సేవలకు పులుస్టాప్ పడుతుంది. అంతవరకు ఇక్కడ ఇరుకు గదులే శరణ్యం.

గది చిన్నది.. పరిధి పెద్దది

ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది ఉండడానికి సరిపడా షెల్లర్లు లేవు. చిన్న గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 8 ఏళ్ల క్రితం దీని పరిధి పెరిగింది. 2015 వరకు అటు పైనాపిల్ కాలనీ, విశాఖ కేంద్ర కారాగారం నుంచి ఆరిలోవ, పెదగదిలి, హనుమంతవాకతో పాటు ఇటు విశాలాక్షినగర్, జోడుగుళ్ల పాలెం, కైలాసగిరి వరకు మాత్రమే ఉండేది. 2015లో అంత వరకు పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాలను ఆరిలోవ స్టేషన్ పరిధిలో కలిపేశారు. ఇందుకు తగ్గట్టు సిబ్బందిని పెంచారు. కానీ భవన విస్తరణ చేపట్టలేదు. దీంతో ఒకే గదిలో సీఐ, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ గది లోపల చిన్న భాగాలుగా చేశారు. అందులో సీఐ కేబిన్, పక్కనే ఎస్‌ఐలు కూర్చోవడానికి టేబుళ్లు, కంప్యూటర్ ఆపరేటర్, రికార్డులు రాసేవారిని ఇరికించారు. కొంత మంది సిబ్బంది ఇటీవల బయట రేకుల షెడ్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఎస్‌ఐతోను, సీఐతోను ఏదైనా సమస్యను విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలకు ఇబ్బంది ఎదురవుతోంది. అందరూ ఒకేసారి ఇరుకు గదిలోకి వెళ్లడంతో గందరగోళంగా మారుతోంది. ఇది రోజూ జరుగుతున్న తతంగమే. ఒక్కోసారి ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ఇదేమి స్టేషన్ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

43 మంది సిబ్బంది అయినా ఇబ్బందే..

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం 43 మంది సిబ్బంది ఉన్నారు. వారంతా ఇబ్బందిపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలతో పాటు ముగ్గురు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 31 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. కానిస్టేబుళ్లలో 24 మంది పురుషులు కాగా, ఏడుగురు మహిళలున్నారు. మరి కొందరు హోంగార్డులు కూడా ఇక్కడ పని చేస్తున్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ వారు అంతా అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించకపోవడం విశేషం.

ఇక్కడ మొత్తం 31 మంది కానిస్టేబుళ్లలో ప్రొటోకాల్(రుషికొండ వద్ద టీటీడీ ఆలయం, కైలాసగిరి, హెల్త్‌సిటీకి వస్తున్న మంత్రులు, చైర్మన్లు, ప్రముఖ వ్యక్తుల వద్ద)లో కొందరు, వేర్వేరు ప్రాంతాలలో అటాచ్‌మెంట్‌లోను, మొబైల్ ఇన్‌చార్జిలు, పికెటింగ్‌లకు ఇంకొందరు, రోజువారి సెలవులు, సిక్ లీవ్‌ల్లో మరికొందరు ఉండగా 17 మంది మాత్రమే మిగులుతున్నారు. వారిలో స్టేషన్‌లో రైటర్, కంప్యూటర్ వర్క్, రిసెప్షన్ పనులకు ఐదుగురు ఉంటున్నారు. మిగతా 12 మంది మాత్రమే స్టేషన్ పరిధిలో అటు పైనాపిల్‌కాలనీ, దారపాలెం, ఆరిలోవ, కొండవాలు ప్రాంతాలైన దీన్‌దయాల్‌పురం నుంచి హనుమంతవాక వరకు, ఇటు ఆదర్శనగర్, డెయిరీఫారం, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ వరకు లా అండ్ ఆర్డర్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంత విశాల ప్రాంతంలో చాలీచాలని సిబ్బంది కావడంతో ఇక్కడ సమస్యలు తలెత్తుతున్నాయి. నిత్యం గొడవలు, దొంగతనాలు, ఆకతాయిల అల్లర్లు జరుగుతున్నప్పటికీ నియంత్రించలేకపోతున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించి అదనపు సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త స్టేషన్ భవనం పూర్తికి కృషి



ఆరిలోవ పోలీస్ స్టేషన్ కోసం హనుమంతవాక వద్ద విమ్స్ పక్కన కొత్తగా భవన నిర్మాణం జరుగుతోంది. చాలా వరకు నిర్మాణం పూర్తయింది. మిగతాది త్వరలో పూర్తి చేసేలా ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. ఈ భవనం పూర్తయితే ఇక్కడ సిబ్బంది కొరతతో పాటు ఎలాంటి సమస్యలు ఉండవు. పరిధి విశాలం కావడం, ప్రొటోకాల్ ప్రకారం విధులు ఉండడంతో సిబ్బందితో పాటు అంతా నిత్యం కష్టపడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

– సోమశేఖర్, సీఐ, ఆరిలోవ

క్లుప్తంగా

చిన పోలమాంబ ఉత్సవాలు ప్రారంభం



చిన పోలమాంబ అమ్మవారు నిజరూప

మద్దిలపాలెం: శివాజీ పాలెంలో చిన పోలమాంబ అమ్మవారు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు భక్తులకు అమ్మవారు నిజరూప దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులకు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. శివాజీపాలెం, పీతలవానిపాలెం, తదితర ప్రాంతాలు విద్యుద్దీపాలంకరణతో కళకళలాడాయి. సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

17వ వార్డులో సామాజిక పెన్షన్ల పంపిణీ



పెన్షన్ అందిస్తున్న గేదెల నాగరాజు, తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్ పెన్షన్ కానుకను 17వ వార్డులో విస్తృతంగా పంపిణీ చేశారు. వృద్ధాప్య, వితంతు పింఛన్ రూ.2,750తో పాటు డయాలసిస్ బాధితులకు రూ.10 వేలు పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్ది లక్ష్మణ్‌రెడ్డి, జి.రవి, వలంటీర్లు పాల్గొన్నారు.

వర్షంతో బోసిపోయిన మద్దిలపాలెం సంత



మద్దిలపాలెం సంతలో అంతంత మాత్రంగా ఉన్న జనం

మద్దిలపాలెం : ప్రతి సోమవారం పిఠాపురం కాలనీలో నిర్వహించే మద్దిలపాలెం సంత వర్షంతో జనాలు లేక బోసిపోయింది. దీంతో చిరు వ్యాపారులు దిగాలు పడ్డారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోనై వారపు సంతకు సరకులు తీసుకువచ్చారు. అవి అమ్ముడుపోకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ప్రతి సోమవారం జనంతో కిక్కిరిసిపోయే సంత ఈసారి సాదాసీదాగా సాగింది.

హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ బాధ్యతల స్వీకరణ



జగదాంబ : హార్బర్ ఏసీపీగా మోసెస్‌పాల్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు సీసీఎం విభాగంలో మోసెస్‌పాల్ పని చేశారు. బదిలీపై హార్బర్ ఏసీపీగా వచ్చిన ఆయన సోమవారం షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి ఏసీపీ శిరీషా గుంటూరుకు బదిలీ అయ్యారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

మురిసిన అరుణ పతాకం



జూ పార్కు గేటు సమీపంలో మేడే జెండాఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్

ఆరిలోవ: సీఐటీయూ, జూ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో జూ పార్కు వద్ద సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ జూలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి జూ ప్రధాన ద్వారం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బాలయ్య, కార్మికులు పైడిరాజు, నరసింగరావు, నరేష్, గణేష్, సోమినాయుడు, రమణమ్మ, పైడమ్మ, కనకరాజు, ఆరిలోవ జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కార్యాలయం వద్ద మేడే వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, మద్దిలపాలెం డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : మేడే వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కేఆర్ఎం కాలనీలో నిర్వహించారు. పార్టీ నాయకుడు నూకరాజు అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వామనమూర్తి, రామకృష్ణ, కన్నారావు, కోటి, బాష తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలో సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జెండా ఆవిష్కరణ చేశారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఈ నెల 14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ తెలిపారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల సమీపాన గల పునీత ఆంథోనీ దేవాలయం ఆవరణ బిషప్ హౌస్‌లో కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986 నుంచి ఈ పండగ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ నెల 5 నుంచి 13 వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు దివ్య బలిపూజ జరుగుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాలను ఉత్తరాంధ్ర జిల్లాలోని చర్చ్ ఫాదర్లు నిర్వహిస్తారని తెలిపారు. పునీత పేతురు ప్రధాన దేవాలయం విచారణ కర్తలు, రక్షణగిరి పుణ్య క్షేత్రం డైరక్టర్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, 12న గుంటూరు బిషప్ చిన్నబత్తిన భాగయ్య, 13న విశాఖ అగ్రపీఠాధిపతి మల్లవరపు ప్రకాష్, 14న కార్డినల్ హైదరాబాద్ అగ్రపీఠాధిపతి ఆంథోనీ పూల ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించనున్నారని చెప్పారు. మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశ్వాసులు పాల్గొంటున్నారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు బూర శేషుబాబు, ఆదిరెడ్డి చార్లీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా వెంకన్న రథోత్సవం

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగోరోజు సోమవారం స్వామివారి రథోత్సవం విశేషంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి, భూదేవిలను రథంపై అధిష్టింపజేశారు. సప్తగిరి నగర్‌లోని అలివేలు మంగమ్మ ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

25 మందికి జరిమానా

మద్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు మూడు రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని పట్టుకున్నారు. కంచరపాలెం మెట్టు, బర్మా జంక్షన్, తాటిచెట్లపాలెం, ఎన్ఏడీ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 25 మందిని పట్టుకుని వారి వాహనాలను సీజ్ చేసి, వారిని సోమవారం మూడో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. వారికి రూ.51 వేలు జరిమానా విధించారని చెప్పారు. ప్రతి రోజూ వేరు వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

శ్రీవారికి వెండి బిందెల బహూకరణ



శ్రీవారికి వెండి బిందెలు సమర్పిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి నగరానికి చెందిన అభిరుచి రామకృష్ణ సుమారు రూ. 2.20 లక్షల విలువ చేసే వెండి బిందెలు సోమవారం బహూకరించారు. అదేవిధంగా పూలంగి సేవకు పుష్పాలు సమకూర్చేందుకు రూ.12 వేల నగదు అందజేశారు. ముందుగా మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో వెండి బిందెలతో పూజలు నిర్వహించి శ్రీవారికి సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు, పి.రామకృష్ణారావు, ప్రమోద్, పద్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం



809వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: భావి తరాలను అంధకారంలోకి నెట్టే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉక్కు ఉద్యమం మే డే స్ఫూర్తితో మరింత ఉధృతం కానుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 809వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ముందుగా కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కు ఉద్యమం కోసం కోసం ప్రాణత్యాగాలు చేసిన కార్మికులను స్మరించి, నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక శక్తికి ఎటువంటి నియంతైనా దిగి రావాల్సిందేనన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు ఎంవీపీ కాలనీలోని పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అనాథలకు బియ్యం పంపిణీ

ఆరిలోవ: స్థానిక ముస్తఫా కాలనీలో జీవీఎంసీ ఆధ్వర్యంలో స్థానిక అమ్మానాన్న వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌లో వృద్ధుల మధ్య టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్‌చేసి వృద్ధులకు పంచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇక్కడ వృద్ధులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, హుస్సేన్, అర్జున్, మోహన్, శ్రీనివాస్, అమ్మానాన్న సొసైటీ ప్రతినిధులు రమణ పాల్గొన్నారు.



సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న సూరాడదాసు తదితరులు

ఎంవీపీ కాలనీ: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ 19వ వార్డు నాయకుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గజమాలతో సత్కరించడంతో పాటు 63 కేజీల కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు అధ్యక్షుడు వి.గణేష్, కన్వీనర్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ

ఏయూ క్యాంపస్: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ విద్యార్థి విభాగం విశాఖ రీజనల్ కోఆర్డినేటర్ రెల్ల జానకిరామ్, పార్టీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ్, యువజన నాయకుడు పరవాడ ఈశ్వర్, ఆంధ్ర యూనివర్సిటీ అధ్యాపకులు షారోన్ రాజు, పి.అర్జున్, పరిశోధకులు పాల్గొన్నారు.



ఏయూలో బియ్యం పంపిణీ చేస్తున్న కాంతారావు

పోయిన పర్సు బాధితుడికి అందజేత



బాధితుడికి నగదు, బంగారు గొలుసు అందిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

ఆరిలోవ: రుషికొండ వద్ద టీటీడీ దేవస్థానం కొండపై స్వామి దర్శనం కోసం వెళ్లిన ఓ మహిళ పోగొట్టుకున్న పర్సును ఆరిలోవ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకుని అప్పగించారు. ద్వారకా క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు తెలిపిన వివరాలు ప్రకారం.. గత నెల 15న నగరానికి చెందిన ఇ.రాజేష్ తన తల్లి వరలక్ష్మితో కలసి రుషికొండ వద్ద వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం వెంట తీసుకెళ్లిన పర్స్‌ను వరలక్ష్మి దారిలో పోగొట్టుకున్నారు. ఆ పర్సులో 20 గ్రాముల బంగారు గొలుసు, రూ.5 వేలు నగదు ఉన్నాయి. పర్సు కోసం ఆలయం పరిసరాలలో వెతికినా కనిపించలేదు. దీంతో అదే రోజు రాజేష్ ఆరిలోవ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దానిపై దర్యాప్తు చేపట్టారు. కొండపైన, కిందన సీసీ ఫుటేజీల ద్వారా పరిశీలించారు. ఆ పర్సు ఓ వృద్ధురాలికి దారిలో దొరికినట్లు గుర్తించారు. ఆ వృద్ధురాలిని పోలీసులు గుర్తించి ఆమెను కలసి పర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రైం డీసీపీ జి.నాగన్న బాధితులను సోమవారం పోలీస్ కమిషనరేట్‌కు పిలిపించి, పర్సు అప్పగించారు. బాధితులు సంతోషం వ్యక్తం చేసి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్‌కు ఉత్తమ షూటింగ్ కోచ్ అవార్డు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన ఆర్.గణేష్‌కు ఉత్తమ షూటింగ్ కోచ్ అవార్డు లభించింది. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్, వరాహ వెంకటేశ్వరస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తంగా నగరంలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ లెజెండ్–2023లో గణేష్ ఈ అవార్డును అందుకున్నారు. షూటింగ్ క్రీడా కోచ్‌గా తాను అందించిన సేవలకు గాను ఆయన్ను ఈ అవార్డు వరించింది.

బీచ్ రోడ్డులో పచ్చదనం.. పశువుల పాలు



బీచ్‌లో నాటిన మొక్కలు తింటున్న పశువులు

బీచ్ రోడ్డు: కోట్లాది రూపాయలు వెచ్చించి బీచ్ రోడ్డులో తీర్చిదిద్దిన పచ్చదనం పశువుల పాలవుతోంది. పచ్చదనం పరిరక్షణకు పాటు పడాల్సిన జీవీఎంసీ ఉద్యానవన శాఖ సిబ్బంది చోద్యం చూస్తున్నారు. ఎంతో అందంగా నాటిన మొక్కలను సోమవారం బీచ్‌రోడ్డులోకి గుంపులుగా వచ్చిన పలు పశువులు తినేస్తున్న ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. వీటిని చూస్తూ ఊరుకోలేని కొందరు సందర్శకులు వాటిని బయటకు తరిమేందుకు యత్నించారు. బీచ్ రోడ్డులో ప్రజా గాయకుడు వంగపండు విగ్రహం సమీపంలో ఆవులు చొరబడి, అక్కడ నాటిన మొక్కలను తినేశాయి. ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యానవన శాఖ సిబ్బంది జాడలేకపోవడంతో పశువులు యథేచ్ఛగా బీచ్‌రోడ్డులోకి వచ్చేస్తున్నాయని సందర్శకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యానవన శాఖాధికారులు స్పందించి బీచ్‌రోడ్డులో నాటిన మొక్కలను సంరక్షించాలని కోరుతున్నారు.

'స్పందన'కు 15 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

IN THE HONORABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
O.S. 2/2020

Between:
Thatiparthi Vijaya ...Plaintiffs
And
Nallem Seetha Rama Suvarna Kumari and 13 others ...Defendants

COURT NOTICE

Defendant-10: Sri. Sunkara Naveen Krishna Chaitanya, S/o Sri S.V.V. Satyanarayana Rao, aged 27 years, resident of Door No.4-21-27, Uplands, Pedawaltair, Visakhapatnam.

That you're the Defendant 10 in the above O.S. 2/2020 which has been filed by the plaintiffs against you and the same is stood posted on 11/05/2023 for your appearance. Notices in the above O.S were not served on you in ordinary way and the Honourable Court was pleased to issue notice by substitute service by way of paper publication. Therefore, you are hereby directed to appear on **dt.11-05-2023 at 10:30 A.M.** before the Honorable Court of the **II ADDITIONAL DISTRICT JUDGE, VISAKHAPATNAM** either in person or duly instructed counsel on your behalf, failing which the matter will be decided in your absence as Ex-parte.

(BY COURT ORDER)
By., VYDYULA RAVINDRA PRASAD
Advocate
7, Gokul Complex, Nowroji Road, VISAKHAPATNAM.

IN THE HONORABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
IA 27/2020 in O.S. 2/2020

Between:
Thatiparthi Vijaya ...Plaintiffs
And
Nallem Seetha Rama Suvarna Kumari and 13 others ...Defendants

COURT NOTICE

Respondent -10: Sri. Sunkara Naveen Krishna Chaitanya, S/o Sri S.V.V. Satyanarayana Rao, aged 27 years, resident of Door No.4-21-27, Uplands, Pedawaltair, Visakhapatnam.

That you're the Respondent 10 in the above IA 27/2020 in O.S. 2/2020 which has been filed by the plaintiffs against you and the same is stood posted on 11/05/2023 for your appearance. Notices in the above O.S were not served on you in ordinary way and the Honourable Court was pleased to issue notice by substitute service by way of paper publication. Therefore, you are hereby directed to appear on **dt.11-05-2023 at 10:30 A.M.** before the Honorable Court of the **II ADDITIONAL DISTRICT JUDGE, VISAKHAPATNAM** either in person or duly instructed counsel on your behalf, failing which the matter will be decided in your absence as Ex-parte.

(BY COURT ORDER)
By., VYDYULA RAVINDRA PRASAD
Advocate
7, Gokul Complex, Nowroji Road, VISAKHAPATNAM.